I


సాక్షి పల్నాడు

ఆదివారం । 4 । మే । 2025



వైభవంగా తిరుపతమ్మ తిరునాళ్ల

బాపట్ల: జమ్ములపాలెంలోని త్రిశక్తి ఆలయంలో గోపయ్య సమేత తిరుపతమ్మ తిరునాళ్ల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. విశేష పూజ, అర్చనలు చేపట్టారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 514.00 అడుగుల వద్ద ఉంది. ఇది 138.5810 టీఎంసీలకు సమానం.



అలరించిన భక్తిగీతాలాపన

నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తిగీతాలపన నిర్వహించారు. గాయని అంజనీదేవి బృందం కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు.

న్యూస్‌రీల్

7న శంకర్‌విలాస్ ఆర్‌ఓబీ పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్: ఈ నెల 7వ తేదీన శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ పనుల శంకుస్థాపన జరుగుతుందని, విస్తరణ పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం అధికారులతో కలిసి శంకర్ విలాస్ ఆర్‌ఓబీ రోడ్డు విస్తరణ పనులను కమిషనర్ పరిశీలించారు. తొలుత ఆర్‌ఓబీ నిర్మాణ డిజైన్‌ను పరిశీలించి, ఇప్పటివరకు జరిగిన విస్తరణ పనులు, మార్కింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు ఆర్‌ఓబీ నిర్మాణ పనుల శంకుస్థాపన చేస్తారన్నారు. శంకుస్థాపన జరిగే ప్రదేశం నిర్ణయం అనంతరం శిలాఫలకం ఏర్పాట్లను ఆర్‌అండ్‌బీ అధికారుల సమన్వయంతో చేయాలన్నారు. ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈఈ చిన్నయ్య, ఏఈఈ సంజీవ కుమార్, ఏసీపీలు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి సేవలో అదనపు కమిషనర్



పెదకాకాని: రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ అదనపు కమిషనరు తెనాలి చంద్రకుమార్ దంపతులు శనివారం భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి విచ్చేశారు. ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్, ఆలయ అర్చకస్వాములు, వేదపండితుల వేద మంత్రోచ్చారణల నడుమ మేళతాళాలతో అదనపు కమిషనరు దంపతులకు సాదర స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణలు చేసిన వారు భ్రమరాంబమల్లేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అదనపు కమిషనరు దంపతులకు ఆలయ అర్చక స్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనం చేశారు. తెనాలి చంద్రకుమార్ దంపతులను ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా పునఃప్రతిష్ఠా మహోత్సవాలు



దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలోని కేఆర్ కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో పునఃప్రతిష్ఠా మహోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం రెండవ రోజు నిత్యపూజావిధులు, వాస్తుపూజ, బలిపర్యగ్నీకరణ విధులు, ప్రభాతబలి, లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, జలాధివాసం, క్షీరాధివాసం, అదివాసహోమాలు జరిగాయి. భక్తులు బిందెలతో నీటిని తెచ్చి స్వయంగా విగ్రహాలకు అభిషేకం చేశారు. దేవస్థాన ఈఓ కె.సునీల్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'నీట్' ఏర్పాట్లు పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: నీట్ పరీక్ష కేంద్రాలను శనివారం డీఆర్ఓ ఎస్ఎస్ ఖాజావలి, డీఈఓ సీవీ రేణుక పరిశీలించారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన వారు విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక వసతులపై చీఫ్ సూపరింటెండెంట్‌తో చర్చించారు. హెచ్ఎం షేక్ ఎండీ ఖాసిం ఉన్నారు.

తాళం పడిందా.. ఇల్లు గుల్ల

- నరసరావుపేట పట్టణానికి చెందిన శ్రీనివాసరావు వేసవి సెలవులకు కుటుంబంతో కలిసి ఊరు వెళ్లాడు. నాలుగు రోజుల తర్వాత వచ్చి చూస్తే ఇల్లు గుల్లయింది. బీరువాలోని బంగారంతో పాటు నగదు మాయమైంది.
- నరసరావుపేట రూరల్ మండలం ములకలూరు గ్రామానికి చెందిన సుబ్బాయమ్మ పిల్లలతో పుణ్యక్షేత్రానికి వెళ్లింది. తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఆమెకు ఫోన్ చేశారు. వచ్చి చూస్తే ఇల్లు గుల్లయింది.

- నరసరావుపేటలో వరుస చోరీలు
- తాళం వేసిన గృహాలే లక్ష్యంగా దొంగతనాలు
- వీఆర్వో ఇంట్లో 10 సవర్ల బంగారం, నగదు మాయం
- వారం రోజుల్లో మూడు ఇళ్లు దోచిన దొంగలు
- ఎల్‌హెచ్ ఎంఎస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు



వీఆర్వో గృహంలో దుండగులు పగలగొట్టిన బీరువా

నరసరావుపేట టౌన్: జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో దొంగతనం కేసులు నమోదవుతూనే ఉన్నాయి. జిల్లా కేంద్రం నరసరావుపేటలో గడచిన వారంలో మూడు దొంగతనాలు జరిగాయి. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు చెలరేగిపోతున్నారు. బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు, నగదు దోచుకెళ్తున్నారు. ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలూ మాయమవుతున్నాయి. గత వారం రోజుల కిందట రామిరెడ్డిపేటకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు ఎం.సత్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యక్షేత్రానికి వెళ్లాడు. రెండవ రోజు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన ఇరుగు పొరుగు సమాచారాన్ని అందజేశారు. ఇంటికి వచ్చి పరిశీలించగా బీరువాలో ఉండాల్సిన నగదు, బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ మేరకు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు రోజుల కిందట ప్రకాష్‌నగర్ టౌన్‌హాల్ వెనుక అద్దె భవనంలో నిర్వహిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయ తాళాలను దుండగులు పగలగొట్టారు. అక్కడ విలువైన వస్తువులు లేకపోవటంతో పక్కనే ఉన్న ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. జిల్లా ఉద్యాన అధికారి చందలూరి వెంకట రమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పుణ్యక్షేత్రానికి వెళ్లి వచ్చేలోపు ..

బాపట్ల జిల్లా బల్లికురవ మండలం గుంటుపల్లి గ్రామ వీఆర్వో వెల్లల చెరువు వెంకట శివరామ కృష్ణ ప్రకాష్‌నగర్‌లో ఉంటున్నాడు. శుక్రవారం ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో దైవ దర్శనానికి మోపిదేవి వెళ్లాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు తెలియజేశారు. శనివారం వచ్చి పరిశీలించగా బీరువాలో ఉండాల్సిన సుమారు 10 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.85 లక్షల నగదు, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీం అక్కడకు చేరుకొని ప్రాథమిక ఆధారాలను సేకరించారు.

రాత్రిళ్లు గస్తీ ఏదీ ?

జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో వరుసగా జరుగుతున్న చోరీలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం వేసవి సెలవులు రావటంతో పుణ్యక్షేత్రాలు, బంధువుల ఇళ్లకు, విహార యాత్రలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. దీంతో పాటు ఉక్కపోతకు ఆరుబయట నిద్రించేవారు ఉంటారు. ఇదే అవకాశంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. పోలీస్ అధికారులు స్పందించి రాత్రిళ్లు గస్తీ పెంచి చోరీల నియంత్రణలకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సవాల్‌గా మారిన దొంగతనాలు..

ఇటీవల వరుసగా జరుగుతున్న దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల్ని లక్ష్యంగా చేసుకొని బంగారు ఆభరణాలు చోరీ సంఘటనలు రెండు జరిగాయి. సుమారు రూ.40 లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైంది. మరో వైపు గృహాలను దోచుకోవటం పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. దొంగతనాలను ఛేదించేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.



ఎల్‌హెచ్ ఎంఎస్ సౌకర్యాన్ని ఉపయోగించుకోండి

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌ను ప్రతి ఒక్కరూ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎవరైనా ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేలా ఉంటే సమాచారాన్ని సిస్టమ్‌లో పొందుపరచాలి. టెక్నాలజీ సహాయంతో ఆయా గృహాలకు సాంకేతిక నిఘా ఏర్పాటు చేస్తాం. రోజుల పాటు ఇళ్లకు తాళాలు వేసి ఉంటే సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియపరచండి. వారు ఇచ్చిన సమాచారంతో ఆ గృహాలను సిబ్బంది పర్యవేక్షిస్తారు.

– కె.నాగేశ్వరరావు, నరసరావుపేట డీఎస్పీ

నీట్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



నరసరావుపేట: జిల్లాలో ఆదివారం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎన్ఈఈటీ) పరీక్ష జరగనున్న సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. పరీక్షలు జరుగుతున్న కాకాని జేఎన్‌టీయూ–కె, ఇర్లపాలెం పీఎం కేంద్రీయ విద్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి నీట్ పరీక్ష రాసేందుకు వచ్చే విద్యార్థులకు జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సమయానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షలు ముగిసే వరకు మూసేయాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయం లోపు, పరీక్ష కేంద్రం లోపలికి వెళ్లే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించాలన్నారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచెస్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌లను కేంద్రాల్లోకి అనుమతించ వద్దన్నారు. అవసరమైతే పరీక్ష కేంద్రాల చుట్టుప్రక్కల డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వహించాలని సూచించారు.

వైభవంగా గంగమ్మ తల్లి కలశ శోభాయాత్ర



పిడుగురాళ్ల పట్టణంలోని గంగమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారికి కలశ శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలోని వాసవీ అమ్మవారి దేవస్థానం నుంచి వందలాది మంది మహిళలు కలశాలతో గంగమ్మ తల్లి దేవాలయం వరకు వచ్చి అమ్మకి కలశాలతో అభిషేకాలు చేశారు. ఆలయ పూజారులు అమ్మకి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హాజరైన మహిళలు అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– పిడుగురాళ్ల

మంట కాలమే..!



రెంటచింతలలో సాయంత్రం 3.30 గంటల సమయంలో నిర్మానుష్యంగా ఉన్న మాచర్ల - గుంటూరు ప్రధాన రహదారి

- నిప్పులకొలిమిగా రెంటచింతల
- 43.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల మే ప్రారంభంలోనే నిప్పుల కొలిమిలా మారుతోంది. శనివారం గ్రామంలో గరిష్ట ఉష్ణోగ్రత 43.3 నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. గ్రామంలో కొన్ని రోజులుగా 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో పాటు ఉదయం 10 గంటల నుంచే వడగాడ్పులు వీస్తుండటంతో పాటు నేలనుంచి వచ్చే వెచ్చని సెగలతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. దీంతో ప్రధాన రహదారితో పాటు గ్రామంలోని అంతర్గత రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. అత్యవసరమైతే తప్ప గ్రామస్తులు ఇంట్లోంచి బయటకు రావడం లేదు. వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మేతకు కోసం పొలం వెళ్లిన గేదెలు ఎండ తీవ్రతకు తట్టుకోలేక కుంటలలో, వాగులలో పడుకుంటుండగా, జీవాలు(మేకలు, గొర్రెలు) చెట్లనీడకు వెళ్లి సేద తీరుతున్నాయి. 132 ఏళ్లలో 2003 మే 28న రెంటచింతల గ్రామంలో 49.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ నిర్ధారించింది.

అంగన్ వేడి కేంద్రాలు

వేసవి ఎండల్లోనూ కొనసాగింపు

- ఉక్కపోతతో అల్లాడుతున్న పిల్లలు
- సెలవుల ఊసే ఎత్తని ప్రభుత్వం
- కిశోర వికాసం పేరుతో సమావేశాలు



పలుదేవర్లపాడులో కిశోర వికాసం ర్యాలీ చేస్తున్న కిశోర బాలికలు, అంగన్‌వాడీ సిబ్బంది

ముప్పాళ్ళ: వేసవి సెలవుల్లో అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోంది. చిన్నారులు ఎండల్లో సైతం కేంద్రాలకు రావాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా వేసవి వచ్చిందంటే అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు మంజూరు చేయటం పరిపాటి. మే నెలలో అంగన్‌వాడీ టీచర్లకు 15 రోజులు, మరో 15రోజులు ఆయాలకు సెలవులు మంజూరు చేసేవారు. తెలంగాణ ప్రభుత్వం మే 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించింది. ఇందుకు భిన్నంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మాత్రం సెలవులు ప్రకటించకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అంగన్‌వాడీలపై కక్షతోనే..!

ఇప్పటికే రకరకాల యాప్‌లతో అంగన్‌వాడీ టీచర్లను నానా రకాలుగా ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం తాజాగా ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు చిన్నారులకు ఒంటిపూట బడి పెట్టుకోవాలని, టీచర్లు, ఆయాలు తప్పనిసరిగా సాయంత్రం నాలుగు గంటల వరకూ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఉండాలని ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలల క్రితం జీతాలు పెంపుతో పాటు పెండింగ్‌లో ఉన్న బకాయిలపై అంగన్‌వాడీలు రాష్ట్ర ప్రభుత్వంపై ఆందోళనకు దిగారు. అప్పట్లో ప్రభుత్వం మాట లెక్కచేయకుండా చలో విజయవాడ పేరుతో వేలాది మందితో భారీ ధర్నాను చేపట్టారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న కూటమి ప్రభుత్వం జీతాలు పెంచకపోవడమే కాకుండా వేసవి సెలవులు ఇవ్వకుండా అంగన్‌వాడీలపై కక్ష తీర్చుకుంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఉక్కపోతతో ఇక్కట్లు

ఉదయం 7గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు ఉన్నప్పటికీ ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులు ఉక్కపోత తాళలేక ఏడుస్తుండటంతో వారిని సముదాయించలేక ఆయాలు నానా ఇబ్బంది పడుతున్నారు. మధ్యలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే పరిస్థితి మరింత గందరగోళంగా ఉంటుంది. దీంతో తల్లిదండ్రులు పిల్లలను పంపించకుండా ఇంటి వద్దే ఉంచుకుంటున్నారు. ఫలితంగా హాజరు శాతం సగానికి పైగా తగ్గిపోతోంది. వీరితో పాటుగా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం కోసం ఎండలోనే తప్పనిసరిగా కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుంది.

కిశోర వికాసం పేరుతో...

వేసవిలో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించని ప్రభుత్వం కిశోర బాలవికాసం పేరుతో వారానికి రెండురోజులు సమావేశాలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కార్యక్రమం మంచిదే అయినా, వేసవిలో సెలవులు లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీలు కన్వీనర్లుగా వారి సెంటర్ల పరిధిలోని కిశోర బాలికలను సర్వే చేసి, వారితో సచివాలయ పరిధిల్లోని ఏఎన్ఎంలు, ఎంఎస్‌కేలతో కలిపి ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రాపౌట్, బాల్య వివాహాలపై నష్టాలు, వారికి పుట్టే బిడ్డల అనారోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఆదేశించింది. ఎండలు తీవ్ర ప్రభావం చూపే మే నెల మొత్తం సమావేశాలు నిర్వహించేలా జారీ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

సత్తెనపల్లి ప్రాజెక్ట్ పరిధిలో...

ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, నకరికల్లు, రాజుపాలెం మండలాల పరిధిలో 300 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడు మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో సున్నా నుంచి ఏడాది లోపు 1,598 మంది చిన్నారులు, సంవత్సరం నుంచి ఐదేళ్ల లోపు 6,904 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు 4,094 మంది పిల్లలున్నారు. వీరితో పాటుగా 11 ఏళ్ల నుంచి 14 సంవత్సరాల లోపు 5,511మంది, 18 సంవత్సరాలలోపు 4,606 మంది కిశోర బాలికలు ఉన్నారు. వీరితో పాటుగా 1,411 మంది గర్భిణులు, 1,469 మంది బాలింతలు ఉన్నారు.

నేడు రేపల్లె ప్యాసింజర్ రైళ్లు రద్దు



తెనాలిరూరల్: తెనాలి పట్టణంలోని మారీస్‌పేట మొండిగోడల వద్ద పినపాడు కాల్వపై వంతెన నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో తెనాలి- రేపల్లె మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను ఆదివారం రద్దు చేసినట్టు తెనాలి రైల్వే స్టేషన్ మేనేజర్ టీవీ రమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు–రేపల్లె (67249), రేపల్లె–గుంటూరు(67250), గుంటూరు–రేపల్లె(67223), రేపల్లె–గుంటూరు(67224), తెనాలి–రేపల్లె(67231), రేపల్లె–తెనాలి(67232), తెనాలి–రేపల్లె(67233), రేపల్లె–తెనాలి(67234) రైళ్లను రద్దు చేసినట్టు చెప్పారు. విజయవాడ–తెనాలి(67221) రైలును గుంటూరుకు మళ్లిస్తారని, సికింద్రాబాద్ నుంచి రేపల్లె(17645) వెళ్లే ప్యాసింజర్ రైలు గంట ఆలస్యంగా నడుస్తుందని తెలిపారు.

క్లుప్తంగా

వైవీతో పీఆర్కే, అంబటి భేటీ



మాచర్ల: రాజ్యసభ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి శుక్రవారం రాత్రి మాచర్ల వచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) క్యాంపు కార్యాలయంలో పీఆర్కేతో భేటీ అయ్యారు. భేటీలో గుంటూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. పల్నాడు జిల్లాలో పార్టీ పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి కార్యకర్తను చైతన్య పరిచి పార్టీని బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీఆర్కే అతిథులకు తేనేటి విందు ఏర్పాటు చేశారు.

ఆశాలకు యూనిఫాం చీరెలు పంపిణీ

కార్యాలయంలో పంపిణీ ప్రారంభించిన డీఎంహెచ్‌వో డాక్టర్ రవి



నరసరావుపేట: జిల్లాలోని ఆశా కార్యకర్తలకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి యూనిఫాం చీరల పంపిణీ ప్రారంభించారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొంతమంది ఆశాలకు చీరెలు అందజేసి మాట్లాడారు. ఆశా కార్యకర్తలు తమ విధులు సక్రమంగా నిర్వహిస్తూ జిల్లాను ఉన్నత స్థాయిలో నిలుపుటకు తమ వంతు కృషి అందజేయాలని కోరారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి గీతాంజలి, డీపీహెచ్ఎన్ఓ సురేఖ, డీసీఎం సురేష్ పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగి మృతి

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరుకు చెందిన ఆర్మీ ఉద్యోగి నార్ల నరేష్(34) ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. నరేష్ పంజాబ్‌లోని పటాన్ కోటలో పని చేస్తున్నాడు. శుక్రవారం జరిగిన ప్రమాదంలో అతను మృతి చెందినట్లు అమర్తలూరు ఎస్ఐ జానకి అమర్‌వర్ధన్ శనివారం తెలిపారు. భార్య కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నరేష్ భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం స్వగ్రామానికి తీసుకురానున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం అంత్యక్రియలు గ్రామంలో నిర్వహిస్తారని తెలిపారు.

అనధికారికంగా నడిచే పడవల సీజ్



గింజుపల్లి పడవ రేవులో పడవ సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు.

అచ్చంపేట: ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించకుండా నిబంధనలకు విరుద్ధంగా కృష్ణానదిపై నడుపుతున్న పడవను విజిలెన్స్ సీఐ పాలేరు శివాజీ, విజిలెన్స్ ఎమ్మార్వో లక్ష్మీమాధవి శనివారం సీజ్ చేశారు. విజిలెన్స్ అధికారులు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని గింజుపల్లి నుంచి కృష్ణానదికి ఆవలి ఒడ్డున ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రమైన వేదాద్రికి పడవ నడుపుకునేందుకు ఈనెల 2న గుంటూరు జిల్లా పరిషత్ హాలులో బహిరంగ వేలం నిర్వహించినట్లు తెలిపారు. అచ్చంపేటకు చెందిన రాయిడి శ్రీనివాసరావు రూ.14లక్షలకు హక్కు పొందాడన్నారు. పాట సొమ్ములో రూ.1.32లక్షలు మాత్రమే చెల్లించి ఇంకా చెల్లించాల్సిన సొమ్ము రూ.12.68లక్షలు చెల్లించకుండా అధికారుల కళ్లు కప్పి నదిపై పడవ నడుపుకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడని చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి పడవను సీజ్ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పూర్తి సొమ్ము చెల్లించిన తర్వాత మాత్రమే పడవ నడుపుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మాత్రమే వసూలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా పడవ నడిపితే సహించేది లేదని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో అచ్చంపేట పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ బొల్లేపల్లి సత్యంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



దిడుగు వద్ద సీజ్ చేసిన పడవ

అమరావతి: మండల పరిధిలోని దిడుగు గ్రామ ఇసుక రీచ్ నుండి కృష్ణాజిల్లా ఏటూరు వరకు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ప్రయాణికులను రవాణా చేస్తున్న పడవను శనివారం సాయంత్రం అధికారులు సీజ్ చేశారు. దిడుగు ఇసుకరీచ్‌లో పడవను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ నేతృత్వంలో ఎంపీడీవో పార్వతి, ఎస్ఐ రాజశేఖర్, గ్రామపంచాయతీ సిబ్బంది సీజ్ చేశారు. ఎంపీడీవో పార్వతి మాట్లాడుతూ గత నెల 2వ తేదీన జిల్లా పరిషత్‌ఖ కార్యాలయం గుంటూరులో రేవులో పడవ నడుపుకొనుటకు వేలం నిర్వహించగా అందులో దిడుగు గ్రామానికి చెందిన మంచినేని హరనాథ్ రూ.50,01,116 వేలంపాటను దక్కించుకున్నారు. రూ.2,32000 చెల్లించి అప్పటి నుండి మిగిలిన సొమ్మును చెల్లించకుండా నోటీసులకు స్పందించకుండా ప్రయాణికులను రవాణా చేస్తున్నాడని గుర్తించామన్నారు. పడవ రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, సరంగు లైసెన్స్ మొదలగు పత్రాలు లేకుండా అక్రమంగా పడవ నడుపుతున్నందుకు సీజ్ చేశామని తెలిపారు. సీజ్ చేసిన పడవను అమరావతి పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేయాలని షిఫార్సు చేశామని తెలిపారు.

పీఎం మోదీ రాకతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- అది ప్రజా రాజధాని కాదు పెత్తందారులుండే కాంక్రీట్ జంగిల్
- సామాజిక విశ్లేషకులు ఈదర గోపీచంద్



నరసరావుపేట: సింగడు అద్దంకి వెళ్లాడు వచ్చాడు అనే పాత సామెత చందంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన సాగిందని సామాజిక విశ్లేషకులు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పత్రికలకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి వచ్చి ఏమిచ్చారు అని చూస్తే ఏమీలేదనే చెప్పాలని అన్నారు. పోనీ వచ్చిన పీఎంను కూటమి నేతలు ఏమన్నా అడిగారంటే అదీ ఏమీ లేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ ముగ్గురూ పోటీపడి ప్రధానమంత్రిని పొగిడారే తప్పితే రాజధానికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు, ప్రత్యేక హోదా ఇవ్వమని, రైల్వే జోన్ సంగతి తేల్చండని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపండని, పోలవరం ఎత్తును తగ్గించకుండా పూర్తిస్థాయిలో నిర్మించేలా అనుమతులివ్వండంటూ ఏపీ అడగలేదని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్తగా ఏమైనా చెప్పారా అనేది పరిశీలిస్తే 2019 వరకు చూపిన గ్రాఫిక్స్‌లో అమరావతినే మళ్లీ చూపించారే తప్ప కొత్తదనం ఏమీ కన్పించలేదన్నారు. పేరుకు ప్రజా రాజధాని అని వారు చెప్పుకున్నా పేద, సామాన్య ప్రజలకు మాత్రం చోటు కన్పించటంలేదన్నారు. బడాబడా పెత్తందార్లు, పెట్టుబడిదార్లు ఉండే మరో కాంక్రీట్ జంగిల్ అని చూస్తేనే తెలుస్తోందన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో ఘనంగా నిర్వహించాలని, అందుకు ఇప్పటినుండే ఊరు వాడా ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ఆ రోజు స్వయంగా తానే వచ్చి పాల్గొంటానని ఆదేశాలిచ్చి మరీ వెళ్లారన్నారు. తద్వారా పవన్‌కు సనాతన ధర్మ ప్రచార కొనసాగింపులో భాగంగా ఈ యోగా దినోత్సవ ప్రభావం దక్షిణాదికి విస్తరించేలా కృషిచేయాలని రూట్ మాప్ ఇచ్చి, పరోక్షంగా పురమాయించి నట్లయిందన్నారు. తమది డబులింజన్ సర్కార్ అని చాటుకోవడమే తప్ప ఆంధ్రకు నూతనంగా ఒరిగిందేమీలేదని, రాజధాని పేరిట మళ్లీ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని బాబు ప్రారంభించారని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. తగు సమయములో ప్రజలే ఈ వంచకులకు తగిన బుద్ధి చెప్తారని తెలిపారు.

‘అర్ధ శత’ పురస్కారాల గ్రహీత బెజగంకు సన్మానం



సత్తెనపల్లి: పౌరాణిక కళారంగంలో ‘అర్ధ శత’ పురస్కారాల గ్రహీత బెజగం రవికుమార్ అని పలువురు కళాకారులు కొనియాడారు. పౌరాణిక కళారంగంలో విభిన్న పౌరాణిక పాత్రలు ధరించి ప్రేక్షకులను రంజింప చేసినందుకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో వివిధ కళా సంస్థలు, కళావేదికల నుంచి మొత్తం 50 పురస్కారాలు అందుకున్న సందర్భంగా పట్టణంలోని కళాకారులందరు వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కి అభినందనలు తెలిపారు. పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రాధాకృష్ణ మందిరంలో పట్టణ కళాకారుల సమక్షంలో వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్ మిత్రులు, సహ కళాకారులు, శ్రేయోభిలాషులు శనివారం ఆయనను సన్మానించారు. సీనియర్ న్యాయవాది, కళా భీష్ముడు పిన్నమనేని పాములయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోటగిరి పోతులూరయ్య, చంద్రకుమారి, రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవి శ్రీధర్ తదితరులు బెజగం రవికుమార్‌కి సన్మానపత్రం చదివి వినిపించారు. అనంతరం రవికుమార్ వారందరికి ధన్యవాదాలు తెలిపారు. 10వ తరగతి పరీక్షల్లో 575 మార్కులు సాధించి ప్రతిభ చూపిన కోటి సాహితీని సత్కరించి పెన్నులు బహుకరించారు. కార్యక్రమంలో కళాకారులు కాటుమల నాగేశ్వరరావు, దావీదు, అంజలి కోటేశ్వరరావు, ఎలిశెట్టి ప్రసాద్, మాతంగి సాంబశివరావు, కోటేశ్వరరావు, గిరీష్‌రెడ్డి, సత్యనారాయణరాజు, జి.కృష్ణ, కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

పార్టీ నాయకులతో ప్రకాశం జిల్లా పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి

యద్దనపూడి?

యర్రంవారిపాలెం (కారంచేడు): రాబోయే రోజుల్లో పర్చూరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసేలా చేసి, పార్టీ బలోపేతానికి నాయకులంతా సమన్వయంగా పనిచేయాలని ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం యర్రంవారిపాలెంలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గస్థాయి పార్టీ నాయకులతో మాట్లాడారు. అన్ని ప్రాంతాల అభివృద్ధికి, ప్రధానంగా పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు అండగా ఉండేలా నాయకులు కృషి చేయాలన్నారు. ప్రకాశం జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేలా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొనేలా కష్టపడి పనిచేస్తానన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకోవడమే మనందరి లక్ష్యంగా కృషి చేయాలన్నారు. పేదల పక్షాన ప్రభుత్వంతో పోరాడాల్సి ఉందన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ అమలు జాడ కనిపించడం లేదన్నారు. హామీల్లో ఒక్కదానిని కూడా అమలు చేయకుండాలనే లక్ష కోట్ల అప్పులు చేశారని అన్నారు.

బత్తులను సత్కరించిన నాయకులు



బత్తులను సత్కరిస్తున్న నాయకులు

పార్టీ అధ్యక్షుని ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకునిగా నియామకం పొంది మొదటిసారి స్వగ్రామానికి వచ్చిన బత్తుల బ్రహ్మానందరెడ్డిని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్కరించి, అభినందనలు తెలిపారు. పార్టీలో మొదటి నుంచి ఉంటూ, ఈ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో కారంచేడు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు, మాజీ ఉపాధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు, బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోట శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు మలినేడి జగన్నాథం, లంకా శివ, పంగులూరి నాగేశ్వరరావు, మాజీ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ యాద్దనపూడి హరిప్రసాద్, వేణుగోపాలస్వామి దేవస్థాన చైర్మన్ రావువారి ప్రసాద్, దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భవనం రాజగోపాలరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్ : స్టూడెంట్ యూనియన్ ఆఫ్ నేషన్, కేవీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 21 వరకు ఐఏఎస్ ఫౌండేషన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. శనివారం గుంటూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఐఏఎస్ ఫౌండేషన్ తరగతుల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 8, 9, 10వ తరగతులతో పాటు ఇంటర్ విద్యార్థులకు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు బ్రాడీపేట 2/6లోని యూటీఎఫ్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతాయని చెప్పారు. సివిల్ సర్వీసెస్, ఐఏఎస్ పరీక్షల పట్ల పాఠశాల స్థాయిలో అవగాహన కల్పించి సివిల్స్ పై లక్ష్యాన్ని కలిగించడమే ముఖ్య లక్ష్యంగా తరగతులు ఉంటాయని చెప్పారు. 10 రోజులపాటు నిపుణులు క్లాసులు బోధిస్తారని తెలిపారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి సర్వీస్‌లకు ఎంపిక కావడం ద్వారా ప్రజలకు సేవలు అందించవచ్చని విద్యార్థులకు వివరిస్తారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తల్లిదండ్రులు 63094 81514, 79959 02645, 94948 08589 సెల్‌ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆశిష్, మనీష్, వివేక్, ప్రతిమ, హరిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు అప్పగింత



కృష్ణానదిలో తప్పిపోయిన కొడమంచిలి శ్రీను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పిన పోలీసులు

వెల్దుర్తి: కృష్ణా నదిలో చేపల వేటకు వెళ్లి దారి తెలియక తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ పోలీసులు తెలుసుకుని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన కొడమంచిలి శ్రీను అలియాస్ శ్రీను వెంకట్, అతని భార్య ధనలక్ష్మిలు ఇద్దరూ చేపలు పట్టే పని కోసం వచ్చి వెల్దుర్తి మండలం జెండాపెంట గ్రామంలో నివాసం ఉంటున్నారు. శ్రీను, ధనలక్ష్మిలు ఏప్రిల్ 19 నుంచి కృష్ణానదిలో చేపలు పడుతున్నారు. రోజూ లాగే శ్రీను శుక్రవారం ఉదయం 7గంటలకు కృష్ణానదిలోకి వెళ్లి దారి తప్పిపోయాడు. నీరు, ఆహారం లేక రాత్రంతా కొత్తపుల్లారెడ్డిగూడెం ప్రాంతంలోని అడవిలో ఉండిపోయాడు. శనివారం ఉదయం 9గంటలకు డయల్ 100కి ఫోన్ చేయగా మాచర్ల రూరల్ సీఐ నసీబ్ బాషా ఆదేశాల మేరకు వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి వెంటనే స్పందించి అతని ఫోన్ లొకేషన్ తెలుసుకొని సిబ్బంది సాయంతో ఆ ప్రాంతానికి వెళ్లి అతనిని సురక్షిత ప్రాంతానికి తీసుకు వచ్చారు. అతనిని కుటుంబసభ్యులకు అప్పగించారు. స్వగ్రామానికి వెళ్లేందుకు ఖర్చులను ఎస్ఐ సమందర్‌వలి అందించారు.

మార్టూరు హైవే పై తప్పిన ప్రమాదం

ధ్వంసమైన రెండు కార్లు



ప్రమాదంలో ఐరన్ గ్రిల్‌లో ఇరుక్కున్న శ్రీనివాసరావు దంపతుల కారు



ప్రమాద ధాటికి రహదారి మధ్యలో ఆగిపోయిన కియా కారు

మార్టూరు: నిత్యం రద్దీగా ఉండే మార్టూరు జాతీయ రహదారిపై స్థానిక పెట్రోలు బంకు ఎదుట శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసం కాగా ప్రయాణికులకు పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన మాధవీ లత, శ్రీనివాసరావు దంపతులు తమ కారులో జె. పంగులూరు మండలం రామకూరు గ్రామానికి వెళ్లడం కోసం బొల్లాపల్లి టోల్‌గేట్ వైపు నుంచి మార్టూరు వస్తున్నారు. ఇదే మార్గంలో ఒంగోలు నుంచి విజయవాడ వైపు ఓ కియా కారు వీరి వెనుకనే వేగంగా వస్తుంది. శ్రీనివాసరావు తన కారును మార్టూరు సర్వీస్ రోడ్డులోపైకి వెళ్లటం కోసం స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో మలుపు వైపు తిప్పసాగాడు. ఆ వెనుకనే వేగంగా వస్తున్న కియా కారు డ్రైవరు ఈ పరిణామాన్ని ఊహించక ముందున్న కారును బలంగా ఢీ కొట్టి రహదారి మధ్యలోకి వెళ్లి ఆగిపోయాడు. ప్రమాద ధాటికి కియా కారులోని రెండు బెలూన్లు ఓపెన్ కావడంతో డ్రైవింగ్ సీటులోని వ్యక్తికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాద తీవ్రతకు శ్రీనివాసరావు దంపతుల కారు హైవే పక్కన డివైడర్ పై ఏర్పాటు చేసి ఉన్న ఐరన్ గ్రిల్‌లో ఇరుక్కుని ఎటూ కదలకుండా ఆగిపోయింది. ప్రమాదంలో మాధవీ లత, శ్రీనివాస్‌రావులకు స్వల్ప గాయాలు కాగా హైవే అంబులెన్స్ సిబ్బంది వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హైవే సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని ట్రాఫిక్‌కు అవరోధంగా ఉన్న రెండు కార్లను క్రేన్ సహాయంతో తొలగించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూశారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి



యద్దనపూడి: రోడ్డు ప్రమాదంలో సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన యద్దనపూడి మండలంలోని గన్నవరం–మార్టూరు దండుదారి మధ్య శనివారం మధ్యాహ్నం జరిగింది. ఎస్సై రత్నకుమారి, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన భట్టు రవికృష్ణ (38) అసోంలోని 30వ బెటాలియన్‌లో సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 15 రోజుల క్రితం సెలవులపై స్వగ్రామం పూనూరు వచ్చాడు. శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంపై మార్టూరు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇది ఇలా ఉండగా ద్విచక్ర వాహనం రోడ్డు కుడి వైపున పడి ఉండటం గమనార్హం. ఏదైనా భారీ వాహనం వేగంగా రావటంతో దానిని తప్పించబోయే క్రమంలో ఈ ప్రమాదం జరిగి ఉంటుందేమోనని పోలీసులు భావిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.


రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నరసరావుపేటఈస్ట్: కనీస వేతనం రూ.35వేలు అమలు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు కోరారు. అరండల్‌పేటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ బెంగుళూరు, గోవాలో నిర్వహించిన ఏఐటీయూసీ సదస్సులలో కనీస వేతనం రూ.35వేలుగా తీర్మానించి సాధించే దిశగా ఉద్యమాలకు సిద్ధపడుతున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 5వ తేదీన కారల్‌మార్క్స్ జయంతిని పురస్కరించుకొని జాతీయ కోర్కెల దినంగా ప్రకటించి ఉద్యమానికి కార్యాచరణ రూపొందించినట్టు వివరించారు. కనీస వేతన పరిధిలోకి వచ్చే కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని సమీకరించి ఉద్యమించనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్ పాల్గొన్నారు.

లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి దుర్మరణం



చౌటుప్పల్: లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా వినుకొండ మండలం గంగవరం గ్రామానికి చెందిన సిరిగిరి శ్రీరామమూర్తి(39) చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో గల దివీస్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. పదిహేళ్ల నుంచి భార్యాపిల్లలతో కలిసి చౌటుప్పల్‌లోనే నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు రావడంతో శ్రీరామమూర్తి భార్య ప్రశాంతి పిల్లలను తీసుకొని వారం కిందట తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. దివీస్ పరిశ్రమలోనే పనిచేస్తూ చౌటుప్పల్ రత్నానగర్‌కాలనీలో నివాసముంటున్న తన మిత్రుడు అమర్నేని రమేష్ ఇంటికి శుక్రవారం రాత్రి శ్రీరామమూర్తి వెళ్లాడు. అక్కడ భోజనం చేసిన తర్వాత నాలుగో అంతస్తు నుంచి కిందికి దిగేందుకు లిఫ్ట్ బటన్ నొక్కాడు. లిఫ్ట్ రాక ముందే వచ్చిందని భావించిన బలవంతంగా డోర్ తెరిచి లిఫ్ట్‌లో ఎక్కేందుకు యత్నించి గుంతలో పడిపోయాడు. భారీ శబ్దం రావడంతో రమేష్ బయటకు వచ్చి గమనించగా తీవ్రగాయాలతో శ్రీరామమూర్తి కన్పించాడు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ప్రశాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.